క్లుప్తంగా

నేటి నుంచి ఎర్రబ్యాడ్జీలతో నిరసన

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ శ్రీకాకుళం 2వ డిపో యాజమాన్య వైఖరికి నిరసనగా పీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ తరఫున శుక్రవారం నుంచి ఎర్రబ్యాడ్జీలతో నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు యూనియన్ కార్యదర్శి కె.బాబూరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. డ్రైవర్, కండక్టర్ల చార్జులు వేయకపోవడం, బస్సులు రద్దు చేయడం, కేఎంపీఎల్‌పై వేధింపులు, బలవంతపు ఓటీలు తదితర సమస్యలపై యాజమాన్యం స్పందించని కారణంగా ఆందోళన చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

బంగారం చోరీపై కేసు నమోదు

ఎచ్చెర్ల క్యాంపస్: తమ ఇంట్లో నాలుగున్నర తులాల బంగారం చోరీకి గురైనట్లు ఫరీదుపేట గ్రామానికి చెందిన సువ్వారి స్వాతి ఎచ్చెర్ల పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. ఈ నెల 4న తమ ఇంటి వద్ద శుభకార్యం నిర్వహించామని, ఆరోజు సాయంత్రం బంగారం చోరీకి గురైందని ఫిర్యాదులో పేర్కొన్నారు. సమీప బంధువు పేరును తమ కుమార్తె చెప్పడంతో ఈ విషయాన్ని వారి దృష్టికి కూడా తీసుకెళ్లామన్నారు. ఫిర్యాదు ఆధారంగా దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చిరంజీవి తెలిపారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేయాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: కార్పొరేట్లకు అనుకూలంగా తీసుకొచ్చిన భూయాజమాన్య హక్కు చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని న్యాయవాదులు కోరారు. జిల్లా బార్ అసోసియేషన్ భవనంలో గురువారం జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎన్ని సూర్యారావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. గురువారం జరిగిన రిలే నిరాహార దీక్షా శిబిరంలో న్యాయవాదులు సూర వేణుగోపాలరావు, చింతపల్లి సూర్యనారాయణ, మహిళా న్యాయవాదులు జె.అనితాదాస్, బెజ్జిపురపు సాయికీర్తి, కె.సత్యవాణి, కె.వెంకటలక్ష్మి, సంచాన విజయలక్ష్మి, పి.నాగమణి, అంపోలు సంధ్యారాణి, మోహన్ తదితరులు కూర్చున్నారు. వీరికి పలువురు సంఘీభావం తెలిపారు.

ఆదిత్యాలయ అభివృద్ధికి దానేటి రూ.లక్ష విరాళం


ఈవో రమేష్‌బాబుకు చెక్ అందజేస్తున్న డాక్టర్ దానేటి శ్రీధర్

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ అభివృద్ధికి నగరానికి చెందిన వైద్యుడు దానేటి శ్రీధర్ గురువారం రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ మేరకు విరాళ చెక్కును ఈవో డి.ఎల్.వి.రమేష్‌బాబుకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు మండవిల్లి రవి, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, సిబ్బంది బి.ఎస్.చక్రవర్తి పాల్గొన్నారు.

కమిషనర్‌ను కలిసిన బీసీ సంఘ నేతలు


కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న సంఘ నాయకులు


శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ తమీమ్ అన్సారియాను గురువారం జాతీయ బీసీ సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు పిట్ట చంద్రపతి రావు, అమిరుల్లా బేగ్, దామోదర కేశవ, అడపాక రాంబాబు, రావుపల్లి సురేంద్ర, నాగరాజులు మర్యాదపూర్వకంగా కలిశారు. దుశ్శాలువతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. కార్పొరేషన్ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

రుచి, శుచి తప్పనిసరి


విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ఎంఈఓలు

జి.సిగడాం: గంగువారి సిగడాం ఎంపీపీ పాఠశాలలో జగనన్న గోరుముద్ద పథకాన్ని ఎంఈఓలు అరసాడ రవి, ముళ్ల శ్రీనివాసరావు గురువారం తనిఖీ చేశారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం ఉండాలన్నారు. రుచి, శుభ్రత పాటించాలన్నారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. హెచ్‌ఎం శీర రాము, సిబ్బంది ఉన్నారు.

షిర్డీసాయికి పూజలు


పూజలందుకుంటున్న స్వామివారు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బొందిలీపురంలో దర్బార్ షిరిడీసాయి బాబా మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి మూడు హారతులు, ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

కంపోస్టు కాలనీలోని నూతన భవనం



ఆరోగ్యానికి భరోసా

- నగర ప్రజలకు మరింత చేరువైన వైద్యం
- ఆరుకు పెరిగిన అర్బన్ హెల్త్‌సెంటర్లు
- పూర్తిస్థాయిలో వైద్య సిబ్బంది నియామకం
- రక్త పరీక్షలు, వైద్యసేవలతో పాటు ప్రసవాలు
- భారీగా పెరిగిన ఓపీ

శ్రీకాకుళం:

ఒకప్పుడు నగర ప్రజలు వైద్యం కోసం ప్రభుత్వ పెద్ద ఆస్పత్రికి గానీ ప్రైవేటు హాస్పిటల్‌కు గానీ వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడా పరిస్థితి లేకుండా రాష్ట్ర ప్రభుత్వం నగర ప్రజలకు ఆరోగ్యసేవలను మరింత చేరువ చేసింది. శ్రీకాకుళం నగరంలో ఆరు చోట్ల డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాల(యూహెచ్‌సీ)ను ఏర్పాటు చేసింది. గతంలో ఇవి నాలుగు మాత్రమే ఉండేవి. అవి కూడా స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో కొనసాగడంతో అరకొరగా వైద్యసేవలందేవి. జగనన్న సర్కారు మరో రెండు కేంద్రాలను ఏర్పాటు చేసింది.

పూర్తిస్థాయిలో సేవలు..

గతంలో బర్మా కాలనీ, తోటవీధిలకు సొంత భవనాలుండగా, తాజాగా ఏర్పాటు చేసిన రామకృష్ణానగర్, కంపోస్టు కాలనీ, అరసవల్లి, డీసీసీబీ కాలనీల్లో అధునాతన భవనాలు నిర్మించి సౌకర్యాలు కల్పించారు. ఒక్కో కేంద్రాన్ని రూ.80 లక్షలతో నిర్మించి సేవలందిస్తున్నారు. శాశ్వత ప్రాతిపదికన ఓ వైద్యుడు, ఇద్దరు స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్, ఆయాలను నియమించారు. రక్తపరీక్షలు, యూరిన్ పరీక్షలను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఆరోగ్య కేంద్రంలో ఐదు నుంచి పది వరకు బెడ్‌లు సైతం ఏర్పాటు చేశారు. అవసరమైన వారికి ప్రసూతి సేవలు కూడా అందిస్తున్నారు. వారం కోసారి చిన్నారులకు టీకాలు వేస్తున్నారు. రోగులకు అవసరమైన మందులను ఉచితంగా అందిస్తుండటంతో గతంలో పది నుంచి పదిహేను వరకు మాత్రమే వచ్చే రోగుల సంఖ్య నేడు 60 నుంచి 70 వరకు పెరిగింది. కాన్పులు కూడా నెలకు సరాసరిన 8 వరకు జరుగుతున్నాయి.


హెల్త్‌సెంటర్‌లో రద్దీగా ఉన్న వార్డు




రామకృష్ణానగర్ అర్బన్ హెల్త్ సెంటర్

నమ్మకం పెరిగింది..



పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో మంచి సేవలు అందుతుండటంతో నమ్మకం పెరిగింది. గతంలో బలగలో ఉన్న ప్రభుత్వ పెద్దాసుపత్రికి వెళ్లాల్సి వచ్చింది. ఇప్పుడు కంపోస్టు కాలనీలో ఆరోగ్య కేంద్రం ఉండటం వల్ల వైద్యం కోసం వెళుతున్నాం. మా వీధి వాళ్లంతా వైద్యసేవల కోసం అక్కడికే వెళుతున్నారు.

– లక్ష్మి, కొత్తపేట, శ్రీకాకుళం నగరం

సేవలు బాగున్నాయి..



గతంలో ప్రైవేటు వైద్యుల వద్దకు వెళ్లాను. డబ్బులు ఖర్చయ్యాయి. ఇప్పుడు మా కాలనీలో ఉన్న ప్రభుత్వ కేంద్రానికి వెళ్లాం. మెరుగైన సేవలు అందించి ఉచితంగా మందులు ఇచ్చారు. వారం రోజుల వాడిన తర్వాత ఆరోగ్యం మెరుగైంది. చాలా సంతోషంగా ఉంది.

– రమణమ్మ, బర్మా కాలనీ, శ్రీకాకుళం

బాలల హక్కులు పరిరక్షించాలి


సమావేశంలో మాట్లాడుతున్న కమిషన్ చైర్మన్ అప్పారావు


కలెక్టర్‌ను కలిసిన చైర్మన్, సభ్యులు

అరసవల్లి: రానున్న రథసప్తమి ఉత్సవ ఏర్పాట్లలో బాలలకు, బాలింతలకు హక్కులకు భంగం వాటిల్లకుండా చర్యలు చేపట్టాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ కేసలి అప్పారావు ఆలయ అధికారులను ఆదేశించారు. గురువారం కమిషన్ సభ్యుడు గొండు సీతారాంతో కలిసి సూర్యనారాయణస్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. దర్శన ఏర్పాట్లలో ఎక్కడా లోపం లేకుండా ముఖ్యంగా బాలింతలకు ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేయాలని, తమ బృందం కచ్చితంగా రథసప్తమి నాడు పరిశీలిస్తామని ప్రకటించారు. క్యూకాంప్లెక్స్, కంపార్ట్‌మెంట్లలోనూ చిన్నపిల్లలకు పాలిచ్చేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం అరసవల్లి ఆలయంలో చైల్డ్ ప్రొటెక్షన్ పాలసీల అమలుపై ప్రశ్నించారు. కార్మిక శాఖ, మున్సిపల్, ఐసీడీఎస్, వైద్యారోగ్య శాఖాధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలన్నారు.

కార్యక్రమంలో ఆలయ ఈవో డి.ఎల్.వి.రమేష్‌బాబు, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, పాలకమండలి సభ్యులు మండవిల్లి రవి, కె.సోమేశ్వరరావు, జె.శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ నేత ద్వారపు అజిత్‌కుమార్, ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ పాల్గొన్నారు.

శ్రీకాకుళం పాతబస్టాండ్: కలెక్టర్ మనజిర్ జిలాని సమూన్‌ను రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, సభ్యులు గొండు సీతారాం మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

యూనిఫాం పంపిణీ


యూనిఫాం అందజేస్తున్న దృశ్యం

జి.సిగడాం: స్థానిక ఐకేపీ కార్యాలయంలో సీఎఫ్‌లు, సీసీలకు యూనిఫాం, ఇతర సామగ్రిని మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వాన ప్రమీలరాణి గురువారం పంపిణీ చేశారు. ఐకేపీ ఏపీఎం రెడ్డి రామకృష్ణంనాయుడు, సీసీలు, సీఎఫ్‌లు, డ్వాక్రా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో ఉమాజఠలేశ్వరుడు



శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని నక్కవీధిలో ఉమాజఠలేశ్వరస్వామి దేవాలయంలో మాస శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి అభిషేకాలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు.

యాత్ర-2కు అపూర్వ ఆదరణ


హర్షం వ్యక్తం చేస్తున్న పార్టీ శ్రేణులు

రణస్థలం: ప్రజాసంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర రాజకీయాలను ప్రభావితం చేసిన సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఇతివృత్తంతో తీసిన యాత్ర-2 సినిమా అపూర్వ ప్రజాదరణ పొందుతుందని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పిన్నింటి సాయికుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని రామాంజనేయ థియేటర్‌లో యాత్ర-2 సినిమాను గురువారం వైఎస్సార్‌సీపీ శ్రేణులు తిలకించారు. బాణసంచా కాల్చి ఆనందాన్ని పంచుకున్నారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మహంతి పెదరామినాయుడు, మండల జేసీఎస్ ఇన్‌చార్జ్ చిల్ల వెంకటరెడ్డి, రెడ్డి విశ్వేశ్వరరావు, మహంతి చినరామినాయుడు ఉన్నారు.

ఘనంగా మహా లింగార్చన


లింగార్చన చేస్తున్న సాందీప్ శర్మ

అరసవల్లి: ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామి సన్నిధిలో మాసశివరాత్రి మహా పర్వ శివ పంచాయతన సహిత మహా లింగార్చన కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అనివేటి మండపంలో ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు ఇప్పిలి సాందీప్ శర్మ శాస్త్రోక్తంగా కార్యక్రమం జరిపించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, వేదపండితులు పాల్గొన్నారు.

గురు దత్తాత్రేయస్వామి ఆలయంలో పూజలు


స్వామికి అభిషేకాలు చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: బలగ నాగావళి తీరాన ఉన్న బాలా త్రిపుర కాలభైరవ స్వామి దేవాలయంలో గురు దత్తాత్రేయ స్వామికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఠం నిర్వాహకులు గణేష గురూజీ ఆధ్వర్యంలో స్వామికి అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు.

పకడ్బందీగా పారిశుద్ధ్య నిర్వహణ


దర్శనాల ఏర్పాట్లపై శంకరశర్మతో మాట్లాడుతున్న కమిషనర్ తమీమ్

అరసవల్లి: ఈ నెల 16న రథసప్తమి మహోత్సవానికి లక్షలాది మంది భక్తులు అరసవల్లి క్షేత్రానికి తరలిరానున్న నేపథ్యంలో పారిశుద్ధ్య నిర్వహణలో లోపాలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని నగర కార్పొరేషన్ కమిషనర్ ఎ.తమీమ్ అన్సారియా సిబ్బందిని ఆదేశించారు. గురువారం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ పరిసరాలను మున్సిపల్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. అంతకుముందు ఆలయ ఈవో డి.ఎల్.వి.రమేష్‌బాబు, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలతో కలిసి ఏర్పాట్ల వివరాలను తెలుసుకున్నారు. భక్తులు దర్శనాలకు వచ్చి వెళ్లే మార్గాలు, మున్సిపల్ ఉన్నత పాఠశాల రోడ్డులోని సులభ్ కాంప్లెక్స్‌ను పరిశీలించారు. రథసప్తమి నాడు పారిశుద్ధ్య నిర్వహణకు, తాగునీరు. ఇతరత్రా ఏర్పాట్లకు సిబ్బందిని సమాయత్తం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ ఎం.వెంకటరావు పాల్గొన్నారు.

ఆధారాలు ఉంటేనే ఓట్లు మార్పు


మాట్లాడుతున్న ఎస్‌డీసీ పద్మావతి

రణస్థలం: ఓటర్లు ఒక పోలింగ్ కేంద్రం నుంచి మరో పోలింగ్ కేంద్రానికి మారాలంటే ఓటరు పక్కగా ఫారం–8 అప్లికేషన్‌లో సంతకం చేసి బీఎల్‌ఓలకు ఇవ్వాలని, అటువంటి ఓట్లు మాత్రమే మార్చుతామని ఎచ్చెర్ల నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.పద్మావతి తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో గురువారం సమావేశం నిర్వహించారు. వివిధ పార్టీల ప్రతినిధులు మాట్లాడుతూ కోటపాలెం పంచాయతీకి చెందిన 213 ఓట్లు రెండు కిలో మీటర్ల దూరంలో ఉన్న అల్లివలస పోలింగ్ కేంద్రం పరిధిలో ఉన్నాయని తెలిపారు. దీనిపై ఎన్నికల నమోదు అధికారి మాట్లాడుతూ.. ఫారం–8 ద్వారా సంబంధిత ఓటరు సంతకంతో బీఎల్‌ఓలకు దరఖాస్తు ఇవ్వాలని, అలా చేయకుండా మార్చితే ఇబ్బందులు వస్తాయని వివరించారు. 18 ఏళ్లు నిండిన యువత ఓటు హక్కు కోసం నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. కొత్త ఓటర్లు నమోదు కోసం గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పించడం జరిగిందన్నారు. రణస్థలం, లావేరు, తహసీల్దార్లు ఎల్.రామారావు, పి.ఆదిలక్ష్మి, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ జి.కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

పర్యాటక కేంద్రాల సందర్శనతో విజ్ఞానం


మాట్లాడుతున్న జిల్లా పర్యాటకశాఖ అధికారి నారాయణరావు

ఎచ్చెర్ల క్యాంపస్: పర్యాటక కేంద్రాల సందర్శనతో కొత్త విషయాలను తెలుసుకోవచ్చని జిల్లా పర్యాటక శాఖ అధికారి నడిమింటి నారాయణరావు అన్నారు. ఎచ్చెర్లలోని శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కాలేజ్‌లో పర్యాటక రంగం ప్రాధాన్యత, పర్యాటక రంగం భవిష్యత్‌పై సమావేశం నిర్వహించారు. పార్యాటక రంగం ప్రాధాన్యతపై ఉద్యోగులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రేపటి పర్యాటకం ఎలా ఉండాలన్న అంశంపై ఈ పోటీలు నిర్వహించి, అందరి సలహాలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పర్యాటక రంగానికి ప్రాధాన్యత ఇస్తున్నాయన్నారు. ప్రాధాన్యత గల అన్ని రంగాలను టూరిజంలో చేర్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చక్రవర్తి, ఎంబీఏ విభాగాధిపతి కె.సత్యం, సహాయ పర్యాటక అధికారి డి.రమేష్ పాల్గొన్నారు.

మహా సంకల్ప సభను విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న ఏఐఎం జిల్లా ఉపాధ్యక్షుడు రాము

జి.సిగడాం: ఈ నెల 10వ తేదీన విశాఖపట్నం జిల్లా పాయకరావుపేటలో అంబేడ్కర్ ఇండియా మిషన్ (ఏఐఎం) ఆధ్వర్యంలో నిర్వహించున్న దళితవాడ పంచాయతీ సాధన మహా సంకల్ప సభను విజయవంతం చేయాలని ఏఐఎం జిల్లా ఉపాధ్యక్షుడు శీర రాము పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన ఏఐఎం కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. ఏఐఎం వ్యవస్థాపకులు పీవీ సునీల్‌కుమార్ ఆదేశాల మేరకు సభ్యులందరూ తప్పనిసరిగా సభకు హాజరుకావాలన్నారు. ఏఐఎం మండల సభ్యులు ముద్దాడ గౌరీ, రామారావు, తవుడు తదితరులు పాల్గొన్నారు.

ఫరీదుపేటలో వైద్య సేవలు


బాలికలకు అవగాహన కల్పిస్తున్న వైద్యురాలు ఉషశ్రీ

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎచ్చెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు మాడుగుల ఉషశ్రీ అన్నారు. ఫరీదుపేటలో 104 వాహనం ద్వారా గురువారం పలువురికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. సుగర్, బీపీ పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. విద్యార్థులకు అనారోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. క్షయ, కుష్టు వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. దగ్గు, జ్వరం కొన్ని రోజుల నుంచి రావటం, శరీరంపై స్పర్శలేని మచ్చలు ఉంటే వైద్య సిబ్బంది దృష్టికి తీసుకురావాలన్నారు. నులి పురుగులు నియంత్రణలో భాగంగా ప్రతి ఇంటికీ అల్బెండజోల్ మాత్రలు అందజేయనున్నట్లు చెప్పారు. సర్పంచ్ కొత్తకోట పూర్ణచంద్రరావు, ఏఎన్‌ఎం రజియా పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అభిషేకాలు



శివకామేశ్వరస్వామి, నందీశ్వరునికి అభిషేకాలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని మొండేటివీధిలో లలితా శివకామేశ్వర స్వామివారి సన్నిధిలో మాస శివరాత్రి సందర్భంగా గురువారం స్వామివారికి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం సుగంధ ద్రవ్యాలతో నందీశ్వరునికి అభిషేకాలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.